క్లుప్తంగా

నారాయణపురం హైస్కూల్లో పుస్తకాల పంపిణీ



నారాయణపురంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీటీసీ, సర్పంచి

ఉంగుటూరు: ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని నారాయణపురం ఎంపీటీసీ బండారు నాగరాజు కోరారు. బుధవారం నారాయణపురం హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సర్పంచి దిడ్ల అలకానంద శ్రీనివాస్, ఎంఈవో కె. శ్రీనివాసరావు, స్కూలు చైర్మన్ రవి, హెచ్ఎం షేక్ నాగూర్ సాహెబ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రి సుభాష్‌ను కలిసిన నాయకులు



పూళ్లలో మంత్రి సుభాష్‌కు అభినందిస్తున్న గన్ని వీరాంజనేయులు, నోచర్ల శ్రీనివాస్

భీమడోలు: రాష్ట్ర కార్మిక, బీమా శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం పూళ్లలో పర్యటించారు. తొలుత ఆయన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నోచర్ల సుజాత శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు, మాజీ సర్పంచ్ దంపతులు ఘన స్వాగతం పలికారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఏలూరు పార్టీ టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జిల్లా నాయకులు పుప్పాల హరీష్, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ ఎఎంసీ అధ్యక్షుడు దూసనపూడి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



వాకపల్లిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు, శారీరక మానసిక వికాసానికి దోహదపడే ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తారని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వాకపల్లి సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని వాకపల్లి యూపీ పాఠశాల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు సంస్థలకు దీటుగా అభివృద్ధి చేసి అన్ని సదుపాయాలు కల్పించారని, విద్యార్థులకు ఎన్నో వసతులు, రాయితీలు ఇస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా ఉంటాం



తలసేమియా చిన్నారులను పరామర్శిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స అందించామని రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు.బుధవారం తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా నివారణ దినోత్సవం సందర్భంగా 11 మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సికిల్‌సెల్ అనేది జన్యుపరమైన, రక్తసంబంధిత వ్యాధి అని ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు. పౌష్టికాహారం, వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజన, పౌష్టికాహారం పంపిణీ చేశామని తెలిపారు. మానవత సంస్థ సభ్యులు పరిమి భాగ్యలక్ష్మి, దేవినేని భాస్కరరావు, వీటికి సహకారం అందించారని తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కేవీ సీతారామ్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, రత్నాకర రావు, కేవీ రమణ ఉన్నారు.

వర్షాకాలం.. వ్యాధులు ప్రబలే అవకాశం

- దోమల వ్యాప్తితో పొంచి ఉన్న రోగాలు
- నీరు నిల్వ లేకుండా చేసుకోవడం ద్వారా దోమల వృద్ధి నివారణ
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతే ప్రధానం



కొవ్వలిలో మలేరియా నివారణ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారి గోవిందరావు తదితరులు

దెందులూరు: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, నివాస పరిసరాల్లో నీరు చేరుతోంది. దోమలు వృద్ధి చెంది వాటి ద్వారా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలుతాయని దోమకాటుకు గురికాకుండా, జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మారిన వాతావరణ పరిస్థితులతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. జాగ్రత్త పడకుంటే రోగాల బారిన పడి వైద్య ఖర్చులతో జేబులు ఖాళీ అయ్యే అవకాశం ఉంది.

పొంచి ఉన్న ప్రమాదకర వ్యాధులు

డెంగీ: పగలు కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో ఈ వ్యాధి ప్రబలుతుంది. ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కంటి లోపల కదలికల తగ్గుదల, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతులు కావడం, నోరు ఎండిపోవడం లాంటి లక్షణాలు ఉంటాయి.

మలేరియా : అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకితే చలి జ్వరం, విపరీతమైన తలనొప్పి తదితర లక్షణాలుంటాయి.

చికున్‌గున్యా: ఎడీస్ దోమ ద్వారా ఈ వ్యాధి ప్రబలుతుంది. ఆకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి.

ఫైలేరియా : మురుగునీటితో పెరిగే క్యూలెక్స్ దోమ కాటుతో ఫైలేరియా వ్యాధి సోకుతుంది. మురుగునీటిలో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా కిరోసిన్, ఆయిల్ చల్లి దోమలు నివారించవచ్చు.

నివారణ చర్యలు

ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటితొట్టిలు, పాతటైర్లు, మురుగుకాలువల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమలు ఇంటి లోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం కిటికీలు మూసివేయాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ డ్రమ్ములు, గచ్చులు, ట్యాంకుల్లో ఉన్న నీరు పారబోయాలి. దోమ తెరలు వినియోగించాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వ్యాధులు రాకుండా నియంత్రించవచ్చు. వారం రోజుల పాటు అన్ని మండల గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య పనులు చేయిస్తున్నాం.

– తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా పంచాయతీ అధికారి

ప్రజా సహకారంతోనే సత్ఫలితాలు



ఏ ప్రభుత్వ పథకమైనా నూరు శాతం సత్ఫలితాలు లభించాలంటే ప్రజా సహకారం అవసరం. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం, నూరు శాతం పారిశుద్ధ్యం గ్రామాలుగా ఉండాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రజా సహకారం అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు లభిస్తేనే ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ సుందర్, సూపరింటెండెంట్, దెందులూరు పీహెచ్‌సీ

దెందులూరు కళాశాల విద్యార్థులకు ఏపీఈఏపీ సెట్‌లో ర్యాంకులు



కె. కాంచన



వి.సుప్రియ

దెందులూరు: దెందులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని బైపీసీ విద్యార్థినులు ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ర్యాంకులు సాధించడం గర్వకారణమని ప్రిన్సిపల్ పి.రామశర్మ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు కె.కాంచన 43,444, వి.సుప్రియ 53,028 ర్యాంకు సాధించి వారి తల్లిదండ్రులకు, దెందులూరు గ్రామానికి, ప్రభుత్వ కళాశాలకు, మండలానికి గుర్తింపు, గౌరవాన్ని తీసుకువచ్చారని అభినందించారు. బుధవారం దెందులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన కాంచన, సుప్రియను ప్రిన్సిపల్ రామశర్మ, ఉపాధ్యాయులు కల్యాణి, మల్లికార్జునరావు తదితరులు అభినందించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అందిపుచ్చుకుని దరఖాస్తు చేసిన ఇద్దరు బాలికలకు మంచి మార్కులతో బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులకు అర్హత సాధించడం, తరువాత బ్యాచ్‌లకు చెందిన విద్యార్థుల్లో గొప్ప స్ఫూర్తిని నింపడమేనని ప్రిన్సిపల్ అన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ



గణపవరంలో సికిల్‌సెల్‌పై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి కారణంగా రక్తహీనత, రక్తంలో ఆక్సిజన్ కొరత ఏర్పడి ప్రాణాంతకం అవుతుందని, అందువల్ల అనీమియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది గణపవరంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి లోపభూయిష్ట జన్యువులు వచ్చినప్పుడు పిల్లల్లో అది సికిల్ సెల్ ఎనీమియా అనే పేరు గల తీవ్రమైన వ్యాధికి గురిచేస్తుందన్నారు. రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒంటి నొప్పులు, కీళ్ల నొప్పులు, తీవ్ర అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే ఎనీమియా వ్యాధిగా గుర్తించాలని సూచించారు. 2047 నాటికి భారత ప్రభుత్వం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఆ దిశగా మనమంతా కృషి చేయాలని కోరారు. గణపవరం సర్పంచ్ మూర అలంకారం, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిప్పరలో : ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ప్రదర్శన నిర్వహించారు., వైద్యాధికారులు సంతోష్‌కుమార్‌రెడ్డి, కె.ప్రియాంక, వైద్య సిబ్బంది గ్రామంలో ఎనీమియా వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎనీమియా వ్యాధి ఎర్ర రక్తకణాల రుగ్మత అని, తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందని తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియాపై ఈనెల 19 నుంచి జూలై 3 వరకూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు తెలిపారు.

చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలి



భీమడోలులో నేను బడికి పోతా లక్ష్యాలను వివరిస్తున్న ఎంపీడీవో టి.స్వర్ణలత

భీమడోలు: బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని భీమడోలు ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా అనే కార్యక్రమంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో టి.స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలందరిని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలన్నారు. చేరకుంటే వారి నుంచి కారణాలు తెలుసుకోవాలన్నారు. ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థులకు నాణ్యమైన విద్య, యూనిఫారమ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్టూడెంట్ కిట్లను ఉచితంగా అందిస్తామన్నారు. పదో తరగతి చదివిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధిస్తారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సదుపాయాలు, కనీస సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేసిన ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, అధ్యాపకులు

ఉంగుటూరు: ఈనెల 22న నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు, నోడల్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు వెల్లడించారు. బుధవారం ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. 14 దేశంలోనే మంచి కంపెనీలు ఉద్యోగార్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. రూ.16 వేల నుంచి రూ.65 వేల వరకూ జీతాలు అందజేయబోతున్నారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరకాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పేటీయం, అపోలో టైర్స్, అపెక్స్ ఫైనాన్షియర్స్ సర్వీసు, రెడ్డిఅండ్ రెడ్డి, తదితర ఎంఎన్‌సీ కంపెనీల వారు వారికి కావల్సిన ఉద్యోగులను ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సర్టిఫికెట్లు జెరాక్సు కాపీలతో రావాలని మరిన్ని వివరాలకు బీవీ రెడ్డి సెల్: 9951405034, డాక్టర్ కొండా రవి సెల్: 9491175498 నంబర్లకు ఫోన్‌చేసి వివరాలు పొందవచ్చునని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాలు



సానిగూడెంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రామకృష్ణ



గాలాయగూడెంలో డ్రెయినేజీ పూడిక తీస్తున్న గ్రామ నాయకులు

దెందులూరు: పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం సానిగూడెంలో సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు), పంచాయతీ సిబ్బందితో రెండు చోట్ల, జేసీబీతో కొన్ని చోట్ల మురుగు తొలగించడం, చెత్తను తొలగించడం, బ్లీచింగ్ చల్లించడం పనులు చేయించారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాల మేరకు స్వచ్ఛ సానిగూడెం లక్ష్యంగా అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా క్రమంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని సర్పంచ్ వివరించారు. గాలాయగూడెంలో టీడీపీ నాయకులు పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ, జనసేన నాయకులు పెద్దిశెట్టి నాని, ఇతర నాయకులతో కలిసి పారిశుద్ధ్య పనులు చేయించారు. స్వచ్ఛ గాలాయగూడెంగా తీర్చిదిద్దుతామని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో ఉన్న గాలాయగూడెం ఎటువంటి అపరిశుభ్రతకు తావివ్వకుండా ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని శ్రీనివాసరావు, రామకృష్ణ, నాని అన్నారు.

సార్వా సాగుకు నీటి కష్టాలు



ఛానల్ మెరక తూములోని పొలాలకు ఇంజన్ పెట్టి నీటిని తోడుతున్న రైతులు



గోదావరి కాలువలో అరకొరగా నీటి ప్రవాహం

- కరుణించని వరుణుడు
- డెల్టా రైతులకు బాలారిష్టాలు
- కాలువలు వదిలినా చేలకు చేరని నీరు

భీమడోలు: డెల్టా రైతాంగానికి సాగు కష్టాలు ఆరంభమయ్యాయి. గోదావరి జలాల ఇన్‌ఫ్లో తగ్గడంతో కాలువలకు అరకొర నీటి పంపిణీతో రైతులు సార్వా సీజన్‌లో పంట ప్రారంభ దశకు అవసరమైన సాగునీరు అందక రైతులు ఆందోళన చెందతున్నారు. మెరక తూములకు నీరందక రైతులు ఇంజన్లను పెట్టుకుని నీటిని తోడుకునే పరిస్థితి నెలకొంది. గోదావరి నదికి వచ్చే ఇన్‌ఫ్లోపైనే గోదావరి కాలువకు నీటి పంపిణీ ఆధారపడుతుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఇటూ వర్షాలు కురవక, గోదావరి కాలువకు సరిపడా నీరు రాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువకు ఈనెల 1న నీటిని విడుదల చేసినప్పటికీ నేటికీ పంట పొలాలకు చేరని పరిస్థితి ఏర్పడింది. పూళ్ల -3 తూము వెంబడి ఉన్న 150 ఎకరాల ఆయకట్టుకు నీరందకపోవడంతో సంబంధిత అధికారులు ఇంజన్ పెట్టి నీటిని తోడుకుంటున్నారు. అదనంగా గంటకు రూ.200 వెచ్చిస్తున్నామని రైతులు అంటున్నారు. ఎండల తీవ్రత వల్ల పొలాలు తడపడం కష్టంగా మారిందని వారన్నారు.

అరకొరగా ఆకుమడులు

డెల్టా ప్రాంతంలో ఆకుమడులు వేసే పరిస్థితి లేదు. గోదావరి నదికి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గడంతో జిల్లా ఆయకట్టుకు 7 వేల క్యూసెక్కుల సాగునీరు అవసరం కాగా కేవలం 4వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. గుండుగొలను సెక్షన్ పరిధిలో 1,100 క్యూసెక్కుల నీటికి కేవలం 800 క్యూసెక్కుల నీరే వస్తోంది. అసలే అరకొర నీటిని విడుదల చేయడంతోపాటు కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. గోదావరి కాలువకు శివారున ఉన్న భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లోని 35 వేల ఎకరాల్లో సాగు, ఆక్వా విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలోని రైతాంగానికి 6 అడుగుల నీటి మట్టం ఉన్నట్లయితే పంట పొలాలకు నీరు చేరుతుంది. కానీ 3.6 అడుగులకు మించి నీటి మట్టం లేదు. దీనితో మెరక తూములతో పాటు పల్లపు తూముల వెంబడి ఉన్న ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. దీనితో పాటు వరుణుడు సైతం కరుణించకపోవడంతో రైతులకు బాలారిష్టాలు ప్రారంభమయ్యాయి. సాగు కూడా అలస్యమవుతుందని పూళ్ల- 3 ఛానల్ పరిధిలో రైతులు జి.కృష్ణచైతన్య, కె.నరేష్ తదితరులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు కాలువకు నీటి విడుదలను పెంచాలని రైతులు కోరుతున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరు టౌన్: తన ఇంటి డాబాపై నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును అగంతకులు తెంచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర శివారు చాటపర్రు రోడ్డులోని గీతా కాలనీలో నివాసముంటున్న రమాదేవి ఈనెల 18 రాత్రి తన ఇంటి డాబాపై పడుకుని ఉండగా ఆమె మెడలోని రెండు కాసుల బంగారు గొలుసు దొంగలు తెంచుకుపోయారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీపీఎఫ్ కంపెనీ ఉద్యోగులకు న్యాయం చేయాలి



రాజమండ్రి సీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని కంపెనీ ఉద్యోగులు ప్రకటించారు. తమకు న్యాయం చేయాలని, నియామక సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం ఉద్యోగులు రాజమండ్రిలోని సీపీఎఫ్ కంపెనీ గేటు ముందు ఆందోళన నిర్వహించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని, కంపెనీని తిరిగి ప్రారంభించాలని వారు నినాదాలు చేశారు. గణపవరం సీపీఎఫ్ కంపెనీ మెయిన్‌గేటు వద్ద ఉద్యోగులు పదిహేను రోజులుగా వివిధ రకాలుగా ఆందోళనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా యాజమన్యం పట్టించుకోకపోవడంతోనే తామంతా రాజమండ్రి కంపెనీ వద్ద ఆందోళన చేపట్టామని అన్నారు.

రాజకీయ వేధింపులపై చర్యలు తీసుకోవాలి

పెదవేగి : పెదవేగి మండలంలోని మధ్యాహ్న భోజన వర్కర్లను రాజకీయంగా వేధించే వారిపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓకి సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలోని మధ్యాహ్న భోజన పథక కార్మికులను తొలగించాలని చూస్తున్నారని, మిడ్ డే మిల్స్ కార్మికులు 24 ఏళ్లుగా అనేక ఇబ్బందులకు గురవుతూ ఈ పథకాన్ని కార్మికులు కొనసాగిస్తున్నారని చెప్పారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కార్మికులను వేధింపులకు గురి చేసి తొలగించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యాశాఖ అధికారి కార్మికులను యథాతథంగా కొనసాగించి రాజకీయ కక్ష సాధింపులు అరికట్టాలని ఆమె కోరారు.

జాలిపూడిలో పారిశుద్ధ్య పనులు చేయాలి

ఏలూరు రూరల్: జాలిపూడి ఎస్సీ కాలనీలో తక్షణం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎస్సీ కాలనీ పెద్ద సీరియల్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఎస్సీ కాలనీ పరిసరాల్లో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేయడం లేదన్నారు. కాలనీలో మురుగునీరు, చెత్త చెదారంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఇదేమని సిబ్బందిని ప్రశ్నిస్తే గ్రామ టీడీపీ నాయకులు ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టవద్దన్నారని చెప్పారన్నారు. కొందరు టీడీపీ నాయకులు పంచాయతీ పాలన వ్యవహారాలు పరివేక్షిస్తూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే నెపంతో ఎస్సీలు నివసిస్తున్న ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు.